పెన్ పవర్
10 YEAR ANNIVERSARY 2014 - 2024
తెలంగాణ రౌండప్
శనివారం 25 జనవరి 2025 పేజీలు 8

## బీఆర్ఎస్‌కు పార్టీకి సునీల్ రావు రాజీనామా



హైదరాబాద్ పెన్ పవర్: బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌కు మరో బిగ్ షాక్ తగిలింది. కేసీఆర్‌కు సన్నిహితుడు, కరీంనగర్ మేయర్ సునీల్ రావు బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. కేంద్రమంత్రి బండి సంజయ్ సమక్షంలో శనివారం (జనవరి 25) బీజేపీలో చేరబోతున్నట్లు ఆయన ప్రకటించారు. కరీంగనర్ అభివృద్ధి కోసమే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. స్థానిక ఎస్బీఎస్ ఫంక్షన్ హాల్‌లో మధ్యాహ్నం 12:00 జాయినింగ్ - మిగతా 2లో...



# రాజకీయాలకు అతీతంగా... ప్రభుత్వ పథకాలు...

శామీర్‌పేట్‌లో ప్రజాపాలన గ్రామసభలో పాల్గొన్న ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి..

మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, జనవరి 24: అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు అందిస్తున్నాం అలాగే ఇందిరమ్మ ఇల్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా తో పాటు రైతు భరోసా..! ప్రతి రైతుకు సాగు చేస్తున్న ప్రతి ఎకరాకు రైతు భరోసా అందిస్తామని ప్రభుత్వ ఛీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి అన్నారు.. రాజకీయాలకు అతీతంగా అర్హులైన లబ్ధిదారుల ఎంపిక ఉంటుందని అన్నారు.. ఇల్లులేని ప్రతి ఒక్కరికి, స్థలమున్నా.. స్థలం లేకున్నా.. నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇల్లు, ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు అందించేందుకు ఈ ప్రభుత్వం కట్టుబడి ఉందని శామీర్ పేట మండల కేంద్రంలో ప్రజా పాలన గ్రామసభలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న తెలంగాణ ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి అన్నారు.. శుక్రవారం షామీర్‌పేట్ లోని గ్రామసభలో తెలంగాణ ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి పాల్గొని మాట్లాడుతూ ప్రభుత్వం ఈనెల 26 నుండి ఇందిరమ్మ ఇల్లు, కొత్త రేషన్ కార్డులు, భూమిలేని రైతులకు నెలకు రూ.1 వెయ్యి ఆర్థిక సాయం అందిస్తామన్నారు.. ఆరు గ్యారంటీల్లో మిగిలిన హామీలను సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం అమలుపరుస్తుందన్నారు. మేడ్చల్ జిల్లాలో 4,104 మంది రైతులకు రూ.28 కోట్ల రుణమాఫీ జరిగిందని, ఘట్కేసర్, పూడూరు, దుండిగల్ సహకార సంఘాల ఆడిట్ నేపథ్యంలోని ఇబ్బందులతో త్వరలో మరో 2 వేల మంది రైతులకు రుణమాఫీ అవుతుందని మహేందర్ రెడ్డి తెలిపారు.. శామీర్ పేట మండలంలో 550 మంది రైతులకు రూ.4 కోట్ల రుణమాఫీ జరిగిందని, శామీర్ పేట గ్రామంలో 117 మంది రైతులకు రూ.78 లక్షల రుణమాఫీ జరిగిందని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు అందిస్తున్నాం అలాగే ఇందిరమ్మ ఇల్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా తో పాటు రైతు భరోసా ప్రతి రైతుకు సాగు చేస్తున్న ప్రతి ఎకరాకు అందిస్తామన్నారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, ప్రజాప్రతినిధులు, ఎంపిడిఓ మమతా బాయి తదితరులు పాల్గొన్నారు..

## తెలంగాణ కంపెనీలనే దావోస్ కి తీసుకెళ్లి ఒప్పందాలు చేసుకున్నారు

- ఒప్పందాలు పేపర్లకే పరిమితం కాకూడదన్న కిషన్ రెడ్డి
- క్షేత్ర స్థాయిలో పనులు ప్రారంభం కావాలని వ్యాఖ్య
- కాంగ్రెస్ ప్రభుత్వం పారిశ్రామికవేత్తలను వేధిస్తోందని విమర్శ

-2 లో




## కాంగ్రెస్ ప్రభుత్వంపై రాజాసింగ్ సంచలన ఆరోపణలు

- ప్రజలను రక్షించాల్సిన పోలీసులే లంచం తీసుకుంటూ పట్టుబడుతున్నారన్న రాజాసింగ్
- పోలీసు అధికారుల ఛాంబర్లలో కెమెరాలు పెట్టాలని సూచన
- లంచాలు తీసుకుంటుంటే ప్రభుత్వానికి చీమకుట్టినట్లు కూడా లేదని విమర్శ

హైదరాబాద్ పెన్ పవర్:రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక లంచాలు పెరిగాయని బీజేపీ నేత, గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ అన్నారు. ప్రజలను రక్షించాల్సిన పోలీసులే లంచం తీసుకుంటూ పట్టుబడుతున్నారని వ్యాఖ్యానించారు. పోలీసులు ఏసీబీకి చిక్కడం బాధాకరమన్నారు. పోలీస్ అధికారుల ఛాంబర్లలో సీసీ కెమెరాలు పెట్టడమే కాకుండా లంచం తీసుకుంటూ పట్టుబడితే ఉద్యోగం నుంచి తొలగించాలని బీజేపీ ఎమ్మెల్యే డిమాండ్ చేశారు. లంచం తీసుకుంటున్న ఘటనలు ఎన్నో బయటకు వస్తున్నాయని, కానీ ప్రభుత్వానికి చీమకుట్టినట్లు కూడా లేదన్నారు. -2 లో



## బీఆర్ఎస్‌కు పార్టీకి సునీల్ రావు రాజీనామా

- మొదటి పేజి తరువాయి

కార్యక్రమం ఉంటుందని తెలిపారు. కాగా, సునీల్ రావు కరీంనగర్ బీఆర్ఎస్‌లో కీలక నేత. ప్రస్తుతం కరీంనగర్ మేయర్‌గా ఉన్న ఆయన కేసీఆర్ ఫ్యామిలీకి సన్నిహితుడు. మరికొన్ని రోజుల్లో కరీంగనర్, నిజామాద్, ఆదిలాబాద్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ఉన్న నేపథ్యంలో సునీల్ రావు పార్టీని వీడటం గులాబీ పార్టీకి ఎదురు దెబ్బేనని స్థానిక నేతలు చర్చించుకుంటున్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వంపై రాజాసింగ్ సంచలన ఆరోపణలు

- మొదటి పేజి తరువాయి

సీఎం రేవంత్ రెడ్డి కూడా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ప్రజలకు ఎన్నో హామీలు ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ అవినీతిరహిత పాలనను అందిస్తామని మాత్రం హామీ ఇవ్వలేకపోతోందని ఎద్దేవా చేశారు.

## తెలంగాణ కంపెనీలనే దావోస్ కి తీసుకెళ్లి ఒప్పందాలు చేసుకున్నారు

**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దావోస్ పర్యటనపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి విమర్శలు గుప్పించారు. తెలంగాణ కంపెనీలనే దావోస్ కు తీసుకెళ్లి అక్కడ ఎంవోయూలు చేసుకోవడం ఏమిటని ప్రశ్నించారు. ప్రభుత్వ విధానం తనకు ఏమీ అర్థం కాలేదని అన్నారు. విదేశాలు, ఇతర రాష్ట్రాల నుంచి పెట్టుబడులు రావాలని చెప్పారు. దావోస్ లో చేసుకున్న ఒప్పందాలు కేవలం పేపర్లకే పరిమితం కాకూడదని... క్షేత్ర స్థాయిలో పనులు ప్రారంభం కావాలని అన్నారు.

గత బీఆర్ఎస్ ప్రభుత్వం కొందరు వ్యాపారవేత్తలపై పక్షపాతం చూపిందని... ఈ ప్రభుత్వం అందరినీ వేధిస్తోందని కిషన్ రెడ్డి విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వేధించని పారిశ్రామికవేత్త ఒక్కరు కూడా లేరని అన్నారు. మరోవైపు, దావోస్ పర్యటనను ముగించుకున్న సీఎం రేవంత్ రెడ్డి ఈ ఉదయం హైదరాబాద్ కు చేరుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం కుదుర్చుకున్న ఒప్పందాల్లో మేఘా కంపెనీ ఒప్పందం కూడా ఉండటం విమర్శలకు దారితీసింది.

## నిర్మాతలకు బిగ్ షాక్.. బెనిఫిట్ షోలకు అనుమతి ఇవ్వొద్దన్న హైకోర్టు..!

**హైదరాబాద్ పెన్ పవర్:**అల్లు అర్జున్ నటించిన పుష్ప 2 ప్రీమియర్ షో సంద్భరంగా జరిగిన పరిణామాలతో ఇకపై రాష్ట్రంలో బెనిఫిట్ షోలు, టికెట్ రేట్ల పెంపుకు అనుమతి ఇవ్వమని తెలంగాణ ప్రభుత్వం చెప్పిన విషయం తెలిసిందే. కానీ రామ్ చరణ్ నటించిన గేమ్ ఛేంజర్ మూవీ టికెట్ రేట్ల పెంపుకు తెలంగాణ ప్రభుత్వం పర్మిషన్ ఇచ్చింది. దీనిని సవాల్ చేస్తూ తెలంగాణ హైకోర్టులో పిటిషన్ దాఖలు అయ్యింది. ఈ పిటిషన్ పై 2025, జనవరి 24 హైకోర్టులో విచారణ జరిగింది.  ఈ సందర్భంగా పిటిషనర్ గేమ్ చేంజర్ మూవీ టికెట్ రేట్ల పెంపు విషయాన్ని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. దీనికి స్పందించిన ప్రభుత్వ న్యాయవాది.. సినిమాకి టికెట్ల ధరలను పెంచుతూ ఇచ్చిన అనుమతులను రద్దు చేసినట్లు కోర్టుకు తెలిపారు. ఇరు వర్గాల వాదనలు విన్న హైకోర్టు.. అర్ధరాత్రి 1.30 గంటల నుంచి ఉదయం 8.40 గంటల మధ్య సినిమాటోగ్రఫీ చట్టం ప్రకారం ఎలాంటి షోలకు అనుమతి ఇవ్వొద్దని ప్రభుత్వాన్ని ఆదేశించింది. అనంతరం ఈ కేసు తదుపరి విచారణను 2025, ఫిబ్రవరి 21వ తేదీకి వాయిదా వేసింది. హైకోర్టు ఆదేశాలతో నిర్మాతలకు బిగ్ షాకే అంటున్నారు సినీ ప్రముఖులు.

# తెలంగాణ రాష్ట్రానికి పెట్టుబడుల సమీకరణలో పారదర్శకతను ప్రదర్శించాలి

**హైదరాబాద్ పెన్ పవర్:**ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సు ( డబ్ల్యూఈఎఫ్)అనంతరం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పెట్టుబడుల అంశాల్లో పారదర్శకంగా వ్యవహరించాలని భారతీయ జనతా పార్టీ డిమాండ్ చేస్తోంది. తెలంగాణకు రూ. 1.7 లక్షల కోట్ల విలువైన ఒప్పందాలపై హర్షం వ్యక్తం చేసినప్పటికీ, గత సంవత్సరం డబ్ల్యూఈఎఫ్ సదస్సులో హామీ ఇవ్వబడిన పెట్టుబడుల స్థితిని వివరించేలా శ్వేతపత్రం విడుదల చేసి రాష్ట్ర ప్రభుత్వం నిబద్ధతను చాటుకోవాలి.

"గత సంవత్సరం డబ్ల్యూఈఎఫ్ సదస్సులో ప్రభుత్వం రూ. 48,000 కోట్ల పెట్టుబడులపై హామీ ఇచ్చింది. కానీ, ఆ ఒప్పందాల్లో ఎన్ని అమలు దశకు చేరుకున్నాయో ఇంతవరకు స్పష్టం చేయలేదు. తెలంగాణ ప్రజలకు వాస్తవాలు, గణాంకాలు తెలియజేయడం ప్రభుత్వ బాధ్యత. ఇప్పటికైనా వాస్తవాలను తెలియజేయాలి.

తెలంగాణ రాష్ట్రానికి పెద్ద మొత్తంలో పెట్టుబడుల హామీలు ఇవ్వడమే సరిపోదు. యువతకు ఉద్యోగాలు కల్పించడంతో పాటు ఆర్థికాభివృద్ధికి దోహదం చేయాలి. ఒప్పందాలు సాధారణంగా ప్రణాళికలకే పరిమితమతమయ్యాయి. వాటిలో అనేకం అమలుకు చేరుకోలేదు. గతంలో ఇచ్చిన పెట్టుబడుల హామీల ఫలితాలను వివరించే పారదర్శకమైన నివేదికను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయాలి. ఇది ప్రజల నమ్మకాన్ని పెంపొందించడంతో పాటు ప్రభుత్వం పారదర్శకతను మెరుగుపరుస్తుంది.

ప్రభుత్వం పెట్టుబడుల గణాంకాలను రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకుంటోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పారదర్శకతకు ప్రాధాన్యం ఇచ్చి గత డబ్ల్యూఈఎఫ్ హామీలపై సమగ్ర నివేదిక విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నాం. ప్రజలకు నిజమైన పెట్టుబడులను ఆకర్షించే, అవకాశాలను సృష్టించే ప్రయత్నాల కోసం మోదీ ప్రభుత్వం కట్టుబడి ఉందని మరోసారి తెలియజేస్తున్నాం.

# కిలీ ఇంటి పట్టాల కేసు కంచికేనా....?

**హైదరాబాద్ పెన్ పవర్:**ద్వేల్ లో భూభాగోతం రెండు సంవత్సరాల క్రితం వెలుగులోకి వచ్చింది అప్పట్లో కొందరు వైసీపీ నేతలు రెవిన్యూ సిబ్బందితో కుమ్మక్కై డీకేటీ పట్టా భూములకు సైతం నకిలీ పట్టాలు తయారు చేయించి విక్రయాలు చేశారు కోట్లాది రూపాయల సొమ్ము చేసుకున్నారు దీనిపై అప్పటి ఆర్డీవో దృష్టి పెట్టడంతో 17 మందిపై కేసు నమోదు అయింది నిందితులనుంచి పెద్ద ఎత్తున నకిలీ పట్టాలు రెవెన్యూ స్టాంపులు స్వాధీనం చేసుకున్నారు ఆ తరువాత ఈ కేసు మరుగున పడింది బద్వేల్ లో భూ అక్రమాలపై తాజాగా కూటమి ప్రభుత్వం చర్యలకు దిగింది ఈ నేపథ్యంలో నకిలీ పట్టాల కేసులపై దృష్టి సారించి

నిందితులకు శిక్ష పడేలా చేయాలని బాధితులు సంబంధిత అధికారులను కోరుతున్నారు

బద్వేల్ పట్టణం బద్వేలు గోపవరం మండల కలయిక పట్టణానికి సంబంధించి గోపవరం మండలం మడకలవారిపల్లె రెవెన్యూ పొలం ఎక్కువగా ఉంది ఎక్కువ శాతం ప్రభుత్వ భూములు ఇంటి స్థలాలు ఉన్నాయి పట్టణం నానాటికి విస్తరిస్తుంది చుట్టుపక్కల గ్రామీణ ప్రజలు తమ పిల్లల చదువుల కోసం వృత్తి వ్యాపారాల రిత్యా బద్వేల్ పట్టణానికి వచ్చి నివాసం ఉంటున్నారు దీంతో స్థలాల ధరలకు రెక్కలు వచ్చి డీకేటి భూములు కూడా లక్షల రూపాయలు పలుకుతున్నాయి ఈ క్రమంలో గత వైసిపి ప్రభుత్వ హయాంలో డీకేటి భూములకు నకిలీ పట్టాలు విక్రయించి భూముల వివాదాలకు

తెర లేపారు భూమాఫియా గ్యాంగ్ బద్వేల్ లో ప్రభుత్వ స్థలాలను పేదల భూములను నకిలీ పట్టాలతో ఆక్రమించిన తీరు అప్పట్లో కడప జిల్లాలో కలకలం రేపింది ఈ వ్యవహారంలో కొందరు వైసీపీకి చెందిన నేతలు ప్రధానంగా బద్వేలు పట్టణంలో కీలకమైన ఎన్జీవో కాలనీలో నకిలీ పట్టాలు పుట్టించి కోట్ల రూపాయలు సొమ్ము చేసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి బద్వేలు రెవెన్యూ డివిజన్ అయిన తర్వాత మొదటి ఆర్డీఓ ఆకుల వెంకటరమణ నకిలీ పట్టాలపై ఉక్కు పాదం మోపడంతో ఈ వ్యవహారం బయటికి వచ్చింది నకిలీ ఇంటి పట్టాల తయారీలో కీలక సూత్రధారులు పాత్రధారులపై మెరుపుదాడులు చేశారు చాలావరకు ఆధారాలు సేకరించి పోలీసులకు ఫిర్యాదు చేశారు అప్పట్లో పోలీస్ శాఖ కూడా హడావుడి చేసి 17 మందిపై కేసు నమోదు చేసింది ఈ 17 మందిలో కొందరు ఏ పాపం తెలియని వారు కూడా ఉన్నారు అయితే కొందరి మాత్రమే అరెస్ట్ చేశారు మరికొందరు వైసీపీకి చెందినవారు కావడంతో వారిపై ఎలాంటి కేసులు నమోదు చేయలేదు భూముల కబ్జాలు బయటికి తీసి నకిలీల గుట్టు రట్టు చేసి వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసిన తీరు అప్పట్లో రాష్ట్రవ్యాప్తంగా సంచలనంగా మారింది అప్పట్లో బద్వేలు భూముల దందాపై ఇటు పోలీస్ ఇటు రెవెన్యూ శాఖలు చేపట్టిన చర్యలపై ప్రజల్లో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి ఒక బద్వేలు నియోజకవర్గంలోని ఏడు మండలాల్లో దాదాపు 20 వేల కోట్ల రూపాయలు విలువచేసే ప్రభుత్వ భూములు ఇంటి స్థలాలు కబ్జాలకు గురి అయినట్లు రెవెన్యూ పోలీస్ అధికారులు అంచనా వేశారు

### పెద్దల బండారం బయటపడలేదు

నకిలీ పట్టాలతో భూముల ఆక్రమునకు సంబంధించి బద్వేల్ లో వైసీపీకి చెందిన పెద్దల బండారం బయటపడుతుందని అందరూ ఎదురు చూశారు అయితే ఏమైందో ఏమోగానీ ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చి రెండు సంవత్సరాలు అవుతున్న నకిలీ పట్టాల కేసు గప్చిప్ అయింది నకిలీ దందా నడిపే వారిపై మాత్రం చర్యలు తీసుకున్నారు తప్ప దందా వెనుక ఉన్న అసలు సూత్రధారులపై చర్యలు తీసుకోలేదు వారు ఎవరు అనే విషయాలపై ఆరా తీసి ఉంటే ఎన్నో విషయాలు వెలుగులోకి వస్తాయి ఇప్పటికైనా రెవెన్యూ పోలీస్ అధికారులు ఇలాంటి వారిపై ప్రత్యేక నిఘా పెట్టవలసిన అవసరం ఎంతైనా ఉంది కాగా బద్వేల్ మండలం ఒక గ్రామానికి చెందిన డాన్ బద్వేల్ పట్టణంలో ప్రభుత్వ ఇంటి స్థలాలు కబ్జా చేయడంలో నకిలీ ఇంటి పట్టాల తయారీలో చాలా కాలంగా కీలక పాత్ర పోషిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం ఇప్పటికీ అధికార పార్టీని అడ్డుపెట్టుకొని కబ్జాలు నకిలీ పట్టాలు తయారు చేయించడంలో మునిగి పోయినట్లు తెలిసింది నకిలీ పట్టాలు భూముల కబ్జాలపై పోలీసులు కేసు నమోదు చేసిన ఏడుగురి మాత్రమే అరెస్ట్ చేశారు మిగిలిన పదిమంది వైసిపి నాయకులు కవడంతో వారిపై కేసులు నమోదు చేసిన అరెస్ట్ చేయలేదు బద్వేలు పట్టణంలో గత 10 సంవత్సరాలుగా నకిలీ పట్టాలతో భూముల వివాదాలు జరుగుతూనే ఉన్నాయి ముఖ్యంగా వైసిపి ప్రభుత్వ హయాంలో ఇవి భరించలేనంత ఎక్కువయ్యాయి దీని వెనుక బద్వేలు నియోజకవర్గానికి చెందిన వైసిపి ముఖ్య నేతకు కావలసినవారు ఉండడంతోనే అప్పట్లో పోలీసులు రెవెన్యూ వారు ఈ కేసును పట్టించుకోలేదని విమర్శలు ఉన్నాయి.

### కదలని డొంక

ఏదైనా కేసులో చిన్న క్లూ దొరికితే చాలు దాన్ని శోధించి కలుగులో ఉన్న ఎలుకను పోలీసులు బయటికి తీసిన సంఘటనలు ఎన్నో ఉన్నాయి

కానీ బద్వేలు లో రెండు సంవత్సరాల క్రితం వెలుగు చూసిన నకిలీ పట్టాలకు సంబంధించిన కేసులో ఎస్సీ ఎస్టి బిసి కులాలకు చెందిన వారిని మాత్రమే అరెస్టు చూపించారు ప్రముఖుల పేర్లు బయటికి వచ్చినప్పటికీ వారి అక్రమాల వ్యవహారం బయటికి పోక్కనివ్వకపోవడం ఆశ్చర్యానికి గురిచేస్తుంది రాష్ట్రంలో ప్రస్తుతం ప్రభుత్వం మారింది అధికారులు మారారు ఇప్పటికైనా నకిలీ పట్టాల భూములు కబ్జాల కేసులను పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని దీని వెనుక ఉన్న అసలు వ్యక్తులను బయటపెట్టాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు నకిలీ పట్టాల కేసు ప్రభుత్వ భూముల కబ్జాల విషయంలోనూ ఇప్పటికే బద్వేలు తెలుగుదేశం పార్టీ నాయకులు ముఖ్యమంత్రికి నివేదిక ఇచ్చినట్లు విశ్వసనీయ సమాచారం

## బీజేపీ సూరారం డివిజన్.. అధ్యక్షుడిగా కేశవ్ యాదవ్..

**బీజేపీ పార్టీ నుండి పత్రికా ప్రకటన విడుదల..**



కేశవ్‌యాదవ్.. బీజేపీ సూరారం డివిజన్ అధ్యక్షుడిగా నియామకం..

**కుత్బుల్లాపూర్, పెన్ పవర్, జనవరి 24:** మేడ్చల్ జిల్లా సూరారం 129 డివిజన్ బీజేపీ అధ్యక్షుడిగా మద్ద కేశవ్‌యాదవ్‌ని నియమిస్తున్నట్టు బీజేపీ పార్టీ రాష్ట్ర నాయకులు పత్రికా ప్రకటన విడుదల చేశారు.. ఈ సందర్భంగా కేశవ్ యాదవ్ మాట్లాడుతూ నాకు సహకరించిన పార్టీ నాయకులు అందరికీ కృతజ్ఞతలు, ప్రత్యేకంగా ఎంపీ ఈటల రాజేందర్‌కి జిల్లా అధ్యక్షులు ఎస్.మల్లారెడ్డికి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నందనం దివాకర్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు బక్క శంకర్ రెడ్డికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.. పార్టీని నమ్ముకుని నమ్మిన సిద్ధాంతం కోసం కొన్ని సంవత్సరాలుగా పనిచేస్తున్న బీజేపీ కార్యకర్తలకి ఇది గౌరవం అని కేశవ యాదవ్ అన్నారు.. బిజెపి యువమోర్చా డివిజన్ అధ్యక్షుడిగా, బీజేవైఎం అసెంబ్లీ కన్వీనర్‌గా, రాష్ట్ర లీగల్ సెల్ కన్వీనర్‌గా మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శిగా అంచలంచెలుగా ఎదుగుతూ ఇప్పుడు డివిజన్ బీజేపీ అధ్యక్షుడుగా నియమించడంపై, ఒక సాధారణ కార్యకర్తకు దక్కిన గౌరవంగా భావిస్తున్నానని కేశవ యాదవ్ ఆనందం వ్యక్తం చేశారు.. తనకు ప్రత్యక్షంగా పరోక్షంగా సహకరించిన నాయకుల అందరికి కార్యకర్తలకు పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు..

## మొదటిసారి రికార్డ్‌స్థాయికి చేరుకున్న బంగారం ధర

- రూ.83,000 మార్క్ దాటిన బంగారం ధర
- 99.9 స్వచ్ఛత కలిగిన 10 గ్రాముల బంగారం ధరలో రూ.200 పెరుగుదల
- రూ.500 పెరిగి రూ.93,500 చేరుకున్న కిలో వెండి





**హైదరాబాద్ పెన్ పవర్:**బంగారం ధర పరుగు పెడుతోంది. అంతర్జాతీయ మార్కెట్‌లో అనిశ్చితి పెరిగిన నేపథ్యంలో పెట్టుబడిదారులు పసిడి వైపు చూస్తున్నారు. దీంతో బంగారం ధర భారీగా పెరిగింది. ఢిల్లీలో 10 గ్రాముల బంగారం ధర రూ.83 వేలు దాటింది. బంగారం రూ.83 వేల మార్క్ దాటడం ఇదే మొదటిసారి.99.9 స్వచ్ఛత కలిగిన పది గ్రాముల బంగారం ధర ఈరోజు రూ.200 పెరిగి రూ.83,100కి చేరుకుందని ఆలిండియా సరాఫా అసోసియేషన్ తెలిపింది. 99.5 శాతం స్వచ్ఛత కలిగిన బంగారం ధర రూ.200 పెరిగి రూ.82,700కు చేరుకుంది. వెండి కిలో రూ.500 పెరిగి రూ.93,500కు చేరుకుంది. అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ బంగారం ధర 2,780 డాలర్ల వద్ద కొనసాగుతోంది. వెండి 31.32 డాలర్ల వద్ద ట్రేడ్ అవుతోంది.

# కేపీహెచ్‌బీలో అత్యధికంగా రూ.1.85 లక్షలు పలికిన చదరపు గజం ధర



**హైదరాబాద్ పెన్ పవర్:**కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు (కేపీహెచ్‌బీ) పశ్చిమ డివిజన్ పరిధిలోని ఖాళీ ప్లాట్ల వేలంపాట ఈరోజు జరిగింది. తెలంగాణ హౌసింగ్ బోర్డు ప్లాట్లను వేలం వేసింది. చదరపు గజం అత్యధికంగా రూ.1.85 లక్షలు పలికింది. అత్యల్పంగా రూ.1.50 లక్షలు పలికింది. ఇక్కడి 24 ఖాళీ స్థలాలకు గాను 23 స్థలాలకు వేలంపాట ప్రక్రియ పూర్తయిందని అధికారులు తెలిపారు.ఇదిలా ఉండగా, కేపీహెచ్‌బీ పరిధిలోని ఖాళీ ప్లాట్ల వేలంపాట వ్యవహారంపై హైకోర్టులో శుక్రవారం నాడు విచారణ జరిగింది. కేపీహెచ్‌బీ ఫేజ్ 15 కాలనీ వాసులు దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ టి.వినోద్ కుమార్ విచారణ జరిపారు. ప్రభుత్వం తరఫున ఏజీ సుదర్శన్ రెడ్డి వాదనలు వినిపించారు.54.29 ఎకరాల స్థలంలో లేఔట్ ఉందని, అందులో 10 శాతం గ్రీనరీ కోసం వదిలేయాలని, కానీ గ్రీనరీ కోసం కేటాయించిన స్థలాన్ని కూడా ప్లాట్లుగా చేసి విక్రయిస్తున్నారా? అని కోర్టు ప్రశ్నించింది. అయితే 10 శాతం స్థలాన్ని ఇప్పటికే జీహెచ్‌ఎంసీకి అప్పగించినట్లు ఏజీ కోర్టుకు తెలిపారు.లేఔట్‌లో గ్రీనరీ కోసం కేటాయించిన 10 శాతం భూమి వివరాలను ఇవ్వాలని ఏజీని కోర్టు ఆదేశించింది. తుది కేటాయింపులు చేయకూడదనే షరతుతో వేలంపాటను కొనసాగించవచ్చని తెలిపింది. తదుపరి విచారణను వచ్చే గురువారానికి వాయిదా వేసింది.

# వాసన పీలిస్తే చాలు: బరువు తగ్గటానికి సూపర్ టెక్నిక్ ఇది..



**హైదరాబాద్ పెన్ పవర్:**పిజ్జాలు, బర్గర్లు, షుగర్ ఎక్కువగా ఉండే కుకీస్, స్వీట్లు చూడగానే ఎవరికైనా నోరూరుతుంది. ఆ ఆహార పదార్థాలను ఎవరైనా ఇష్టంగానే తింటారు. కానీ వాటిని తింటే అధిక బరువు, డయాబెటిస్, గుండె జబ్బులు, క్యాన్సర్ వంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉంటుంది. మరి వాటిని తినడం ఎలా? అందుకు ఓ ఉపాయం ఉంది అంటున్నారు సైంటిస్టులు. ఏంటంటే ఏవి తినాలి అని మీకు అనిపిస్తుందో, వాటి వాసన పీల్చుకోండి. అవును 2 నిమిషాల పాటు అలా ఆ ఆహార పదార్థాల వాసన చూస్తే చాలు మీకు వాటిని తిని కడుపు నిండిన భావన కలుగుతుందని ఇటీవల ఓ పరిశోధనలో తేలింది. ఇటీవల, జర్నల్ ఆఫ్ మార్కెటింగ్ రీసెర్చ్ లో ప్రచురించిన అధ్యయనం ప్రకారం... సైంటిస్టులు కొందరికి 30 సెకండ్ల పాటు పలు కుకీల వాసన చూపించారు. దీనితో వారికి ఆ కుకీలను తినాలనే ఆసక్తి కలిగింది. తరువాత వారికి 2 నిమిషాల కన్నా ఎక్కువ సమయం పాటు పిజ్జాలు, స్ట్రాబెర్రీల వాసన చూపించారు. దీనితో వారికి పిజ్జాల మీద ఆసక్తిపోయి కడుపు నిండిన భావన కలిగింది. అనంతరం వారు స్ట్రాబెర్రీలను తినేందుకు ఆసక్తి చూపించారట.

అలాగే పిజ్జాలు, యాపిల్స్ తో మరోసారి టెస్ట్ చేయగా, 2 నిమిషాల అనంతరం వారికి కూడా కడుపు నిండిన భావన కలగడంతో పాటు వారు కూడా పిజ్జాలకు బదులుగా యాపిల్స్ ను తినేందుకు ఆసక్తి చూపించారట. దీని వల్ల సైంటిస్టులు చెప్పేదేంటంటే.. ఎక్కువ క్యాలరీలు ఉన్న ఆహారాలను తినాలనిపిస్తే వాటి వాసన 2 నిమిషాల పాటు చూస్తే చాలు. ఇక ఆ ఆహారాలను తినాలనే ఆసక్తి పూర్తిగా తగ్గిపోతుంది. దీనిద్వారా అధిక బరువు, డయాబెటిస్ వంటి వ్యాధులు రాకుండా జాగ్రత్త పడవచ్చని సైంటిస్టులు చెబుతున్నారు

# సైఫ్ అలీ ఖాన్ పై దాడి కేసు: పలు సందేహాలు వ్యక్తం చేస్తున్న నిందితుడి తండ్రి

- ఇటీవల ముంబయిలో నటుడు సైఫ్ అలీ ఖాన్ పై దాడి
- షరీఫుల్ ఇస్లాం అనే బంగ్లాదేశ్ జాతీయుడ్ని అరెస్ట్ చేసిన పోలీసులు
- తన కుమారుడ్ని అన్యాయంగా ఇరికించారన్న తండ్రి
- వీడియోలో ఉన్నది తన కుమారుడు కాదని స్పష్టీకరణ



**హైదరాబాద్ పెన్ పవర్:**బాలీవుడ్ నటుడు సైఫ్ అలీ ఖాన్ పై దాడి కేసులో బంగ్లాదేశ్ కు చెందిన షరీఫుల్ ఇస్లాం అమీన్ ఫకీర్ అనే వ్యక్తిని ముంబయి పోలీసులు అరెస్ట్ చేయడం తెలిసిందే. అయితే, నిందితుడి తండ్రి మహ్మద్ అమీన్ ఫకీర్ ఈ ఘటన నేపథ్యంలో పలు సందేహాలు వ్యక్తం చేశాడు. పోలీసులు విడుదల చేసిన వీడియోలో ఉన్నది తన కుమారుడు కాదని స్పష్టం చేశాడు. తన కుమారుడు షరీఫుల్ కు జుట్టును పొట్టిగా కత్తిరించుకోవడం అలవాటని, కానీ వీడియోలో ఉన్న వ్యక్తికి పొడుగు జుట్టు ఉందని తెలిపాడు. మరి తన కుమారుడికి ఉన్నట్టుండి పొడుగు జుట్టు ఎలా వచ్చిందని మహ్మద్ అమీన్ ఫకీర్ ప్రశ్నించాడు. పైగా, ఎంతో కట్టుదిట్టమైన సెక్యూరిటీ ఉండే సైఫ్ అలీ ఖాన్ వంటి హీరోపై దాడి చేయడం సామాన్యులకు సాధ్యమయ్యే పనేనా అని సందేహం వ్యక్తం చేశాడు. అసలు, సైఫ్ ఇంట్లోకి వెళ్లడం సులభమైన పనా? అని వ్యాఖ్యానించారు. ఈ కేసు విషయమై భారత్ లో తమకు సాయం చేసేందుకు ఎవరూ లేరని విచారం వ్యక్తం చేశాడు. అందుకే బంగ్లాదేశ్ లో న్యాయపోరాటం చేస్తామని చెప్పాడు.

తన కుమారుడు గతేడాది మార్చిలో భారత్ కు అక్రమంగా వలసవచ్చిన మాట నిజమేనని, ముంబయిలో ఓ హోటల్ లో పనిచేస్తున్నాడని మహ్మద్ అమీన్ ఫకీర్ వెల్లడించాడు. ప్రతి నెల 10వ తేదీన జీతం తీసుకున్న వెంటనే తమకు ఫోన్ చేసేవాడని, సైఫ్ పై దాడి జరిగిన తర్వాత రోజు కూడా తన కొడుకుతో మాట్లాడినట్టు స్పష్టం చేశాడు. తన కుమారుడ్ని అన్యాయంగా ఈ కేసులో ఇరికించారని ఆరోపించాడు.

# మీర్‌పేటలో భార్య హత్య... వెబ్ సిరీస్‌లో చూసి ముక్కలుగా నరికాడు!

- మరో మహిళతో ఉండేందుకే భార్యను హత్య చేసిన గురుమూర్తి
- సంక్రాంతికి పిల్లలను తన సోదరి ఇంటికి పంపించి హత్య
- ఆరు నెలల క్రితం చూసిన వెబ్ సిరీస్‌లో ఉన్నట్లుగా ముక్కలుగా నరికేశాడు




**హైదరాబాద్ పెన్ పవర్:**హైదరాబాద్‌లోని మీర్‌పేటలో భార్యను హత్య చేసిన కేసులో సంచలన విషయాలు వెలుగు చూస్తున్నాయి. నిందితుడు గురుమూర్తి మరో మహిళతో కలిసి ఉండేందుకే తన భార్యను హత్య చేసినట్లుగా పోలీసుల విచారణలో వెల్లడైంది. ఓ వెబ్ సిరీస్ ప్రేరణతో తన భార్యను కిరాతకంగా హత్య చేసినట్లుగా తెలుస్తోంది. భార్యను హత్య చేసి, ముక్కలుగా నరికి, శరీర భాగాలను బకెట్ నీళ్లలో వేసి హీటర్‌తో ఉడికించి మాంసాన్ని ముద్దగా చేసి చెరువులో వేశాడు. నిందితుడి ఫోన్‌ను పరిశీలించగా మరో మహిళతో ఉన్న ఫొటోలు లభ్యమయ్యాయి. ఈ దారుణ హత్య తెలుగు రాష్ట్రాల్లో కలకలం రేపింది.

గురుమూర్తి ఏపీలోని ప్రకాశం జిల్లా రాచర్ల మండలం జేపీ చెరువు గ్రామానికి చెందినవాడు. 13 ఏళ్ల క్రితం అతనికి వెంకటమాధవితో వివాహమైంది. గురుమూర్తి ఆర్మీలో జవాన్‌గా పని చేసి నాయక్ సుబేదార్‌గా పదవీ విరమణ పొందాడు. ప్రస్తుతం కంచన్‌భాగ్ డీఆర్డీవోలో కాంట్రాక్ట్ భద్రతా సిబ్బందిగా పని చేస్తున్నాడు. కొన్నాళ్లుగా అతను మరో మహిళతో వివాహేతర సంబంధాన్ని కొనసాగిస్తున్నాడు. విషయం భార్యకు తెలియడంతో ఇంట్లో గొడవలు జరిగాయి. దీంతో గురుమూర్తి భార్యను అడ్డు తొలగించుకోవాలనుకున్నాడు. సంక్రాంతి సందర్భంగా తన ఇద్దరు పిల్లలను హైదరాబాద్‌లోనే ఉండే తన సోదరి ఇంటికి పంపించాడు. ఈ నెల 15న భార్యాభర్తలకు మరోసారి గొడవ జరిగింది. భార్య తలను గోడకేసి కొట్టాడు. ఆమె చనిపోయిందని నిర్ధారించుకున్నాక ఆరు నెలల క్రితం ఓటీటీలో చూసిన ఓ వెబ్ సిరీస్‌లో ఉన్నట్లుగా మృతదేహాన్ని బాత్రూంలోకి తీసుకువెళ్లి ముక్కలుగా నరికాడు.

వెంకటమాధవి హత్య బాలాపూర్ మండలంలోని జిల్లెలగూడలో తీవ్ర అలజడి రేపింది. న్యూ వెంకటేశ్వర నగర్ కాలనీలోని ఓ అపార్టుమెంట్‌లో గురుమూర్తి దంపతులు ఉంటున్నారు. గురుమూర్తి తన భార్యను హత్య చేసినట్లు తెలియగానే, అపార్ట్ మెంట్ లో ఉండే వారంతా ఖాళీ చేసి వెళ్లిపోయారు.

# 'ఐటీ హబ్‌కు ఇంటర్నెట్ కట్' వార్తపై స్పందించిన కేటీఆర్



**హైదరాబాద్ పెన్ పవర్:**కొత్త కంపెనీల సంగతి దేవుడెరుగు... ఉన్న కంపెనీలు పోకుండా చూడాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఉద్దేశించి ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. 'ఐటీ హబ్‌కు ఇంటర్నెట్ కట్' అని సాక్షి పత్రికలో వచ్చిన కథనాన్ని పోస్ట్ చేశారు. ఈ కథనం ప్రకారం... ఐటీ హబ్‌కు ఇంటర్నెట్ లేకపోవడంతో మూడ్రోజులుగా సేవలు నిలిచిపోయాయని, దీంతో వర్క్ ఫ్రమ్ హోమ్ చేయాలని ఉద్యోగులను అధికారులు ఆదేశించారు.దీనిపై కేటీఆర్ ఎక్స్ వేదికగా స్పందించారు. హైదరాబాద్ నగరం ఒక్కటే కాకుండా తెలంగాణలోని అన్ని ద్వితీయ శ్రేణి నగరాలకు కూడా ఐటీ రంగాన్ని విస్తరించాలనే ఉద్దేశంతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం సుమారు ఎనిమిది ఐటీ హబ్‌లను ఏర్పాటు చేసిందని పేర్కొన్నారు.కానీ కాంగ్రెస్ రాగానే... చక్కగా నడుస్తున్న ఆ ఐటీ హబ్‌లు ఒక్కొక్కటిగా పట్టాలు తప్పుతున్నాయని పేర్కొన్నారు. విద్యుత్, ఇంటర్నెట్ బిల్లులు కూడా కట్టని దుస్థితికి చేరుకున్నాయని... ఫలితంగా కంపెనీలు మూతపడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.గత ప్రభుత్వం మీద కోపంతో ఇలాంటి దుశ్చర్యలు మానుకోవాలని హితవు పలికారు. తెలంగాణ యువతకు ఉద్యోగాలు కల్పించే సదుద్దేశంతో నెలకొల్పిన ఈ ఐటీ హబ్‌లను సక్రమంగా నడపాలని కోరుతున్నానని విజ్ఞప్తి చేశారు.

# పాల ధరలను తగ్గించిన అమూల్

- అమూల్ తాజా, అమూల్ గోల్డ్, అమూల్ టీ స్పెషల్ పాలపై రూ.1 చొప్పున తగ్గింపు
- ఈ తగ్గింపు ధరలు దేశ వ్యాప్తంగా వెంటనే అమలులోకి వస్తాయని ప్రకటన
- అయితే, ఈ తగ్గింపు కేవలం లీటర్ ప్యాకెట్‌కు మాత్రమే వర్తిస్తుందని స్పష్టీకరణ




**హైదరాబాద్ పెన్ పవర్:**దేశంలోనే అతిపెద్ద పాల ఉత్పత్తి సంస్థ అమూల్ తాజాగా పాల ధరలను తగ్గిస్తూ నిర్ణయం తీసుకుంది. అమూల్ తాజా, అమూల్ గోల్డ్, అమూల్ టీ స్పెషల్ పాలపై రూ.1 చొప్పున తగ్గించింది. ఈ మేరకు గుజరాత్ కో-ఆపరేటివ్ మిల్క్ మార్కెటింగ్ ఫెడరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ జయేన్ మెహతా శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. ఈ తగ్గింపు ధరలు దేశ వ్యాప్తంగా వెంటనే అమలులోకి వస్తాయని ప్రకటించారు. అయితే, ఈ తగ్గింపు కేవలం లీటర్ ప్యాకెట్‌కు మాత్రమే వర్తిస్తుందని స్పష్టం చేశారు. ఇక తాజా నిర్ణయంతో అమూల్ టీ స్పెషల్ పాల లీటర్ ప్యాకెట్ ధర రూ. 62 నుంచి రూ.61కి తగ్గింది. అలాగే అమూల్ తాజా పాల ధర లీటర్‌కు రూ. 54 నుంచి రూ. 53కి తగ్గగా... అమూల్ గోల్డ్ మిల్క్ ధర రూ. 66 నుంచి రూ. 65కి దిగి వచ్చింది. కాగా, అమూల్ గతేడాది జూన్‌లో పాల ధరలను లీటర్‌కి రూ. 2 చొప్పున పెంచింది. ఇప్పుడు కొంచెం తగ్గించి వినియోగదారులకు ఊరటనిచ్చింది.

# మేడ్చల్ జిల్లాలో యువతి దారుణ హత్య.. బండరాళ్లతో కొట్టి.. పెట్రోల్ పోసి..




**హైదరాబాద్ పెన్ పవర్:**మేడ్చల్ జిల్లాలో దారుణం జరిగింది. 25 ఏళ్ల యువతిని బండరాళ్లతో కొట్టి కిరాతకంగా హత్య చేశారు గుర్తు తెలియని దుండగులు. యువతిని హత్య చేసిన అనంతరం మృతదేహాన్ని పెట్రోల్ పోసి తగులబెట్టారు నిందితులు. మేడ్చల్ జిల్లాలోని మునీరాబాద్‌లో ఈ ఘటన జరిగింది. స్థానికులు ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. యువతి హత్యపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

మృతురాలు ఎవరు..? ఇక్కడకి ఎలా వచ్చింది..? ఎవరితో వచ్చింది..? అన్న విషయాలపై ముమ్మరంగా దర్యాప్తు చేస్తున్నారు. పరిసర ప్రాంతాల్లోని సీసీ ఫుటేజీని పరిశీలిస్తున్నారు. అలాగే.. మేడ్చల్ జిల్లాలో నమోదైన మిస్సింగ్ కేసుల వివరాలు ఆరా తీస్తున్నారు. నిందితుల కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. ఇటీవల రాష్ట్ర రాజధాని హైరదాబాద్‌లో చోటు చేసుకుంటున్న వరుస హత్యలు నగరవాసులను భయాందోళనకు గురి చేస్తున్నాయి. రెండు వారాల క్రితం నార్సింగ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మణికొండ మున్సిపాలిటీ పుప్పాల్ గూడ అనంత పద్మనాభ స్వామి దేవాలయం గుట్టపై జరిగిన డబుల్ మర్డర్ సంచలనం రేపిన విషయం తెలిసిందే. ఈ ఘటన మురుకవముందే.. తాజాగా మీర్‌పేట్లో ఒళ్లు గగుర్పొడిచే హత్య జరిగింది.

అనుమానంతో ఓ మాజీ ఆర్మీ జవాన్ భార్యను అత్యంత కిరాతకంగా హతమార్చాడు. చంపిన అనంతరం మృతదేహాన్ని ముక్కలు ముక్కలు చేసి ప్రెజర్ కుక్కర్ లో ఉడకబెట్టాడు. అనంతరం ఆ శరీర భాగాలను ఎండబెట్టి పొడిగా మార్చి దగ్గర్లోని చెరువులో పడేశాడు. ఈ ఘటనపై దర్యాప్తు జరుగుతుండగానే.. తాజాగా మేడ్చల్‌లో యువతి దారుణ హత్యకు గురి కావడం గమనార్హం.

# మావోయిస్టు శిక్షణా శిబిరాన్ని ధ్వంసం చేసిన భద్రతా బలగాలు....

**ఇటీవల కాలంలో మావోయిస్టులకు వరుస ఎదురుదెబ్బలు**

**ఛత్తీస్ గఢ్ ఎన్ కౌంటర్లలో మావోల వైపు భారీగా ప్రాణనష్టం**

**బీజాపూర్-తెలంగాణ సరిహద్దుల్లో నక్సల్ శిక్షణ శిబిరాన్ని స్వాధీనం చేసుకున్న బలగాలు**



**హైదరాబాద్ పెన్ పవర్:**ఛత్తీస్ గఢ్ లోని దట్టమైన అడవులను తమ స్థావరంగా మార్చుకుని దశాబ్దాలుగా మనుగడ సాగిస్తున్న మావోయిస్టులకు ఇప్పుడు పరిస్థితులు ఏమాత్రం అనుకూలంగా లేవు. అభివృద్ధి చెందుతున్న టెక్నాలజీని ఉపయోగించుకుంటున్న భద్రతా బలగాలు... డ్రోన్ల సాయంతో నక్సల్స్ స్థావరాలను సులభంగా గుర్తించి దాడులు చేస్తున్నట్టు తెలుస్తోంది. ఇటీవల కాలంలో జరుగుతున్న ప్రతి ఎన్ కౌంటర్ లోనూ దాదాపు పదుల సంఖ్యలో మావోలు మరణిస్తున్నారు.

తాజాగా, బీజాపూర్-తెలంగాణ సరిహద్దుల్లోని భట్టిగూడ అడవుల్లో మావోయిస్టు శిక్షణ శిబిరాన్ని కోబ్రా బెటాలియన్ జవాన్లు తమ అధీనంలోకి తీసుకున్నారు. ఆర్మీ ట్రైనింగ్ క్యాంప్ ను తలపించే రీతిలో ఆ శిబిరంలో సౌకర్యాలు ఉండడం గుర్తించారు. దట్టమైన అడవులు, కొండల మధ్య విశాలమైన ప్రదేశంలో భవనాలు, షెడ్లు, ట్రైనింగ్ ఏర్పాట్లు చూస్తుంటే, ఒకేసారి ఎక్కువమందికి శిక్షణ ఇచ్చేలా ఆ శిబిరాన్ని నిర్మించినట్టు భావిస్తున్నారు. కాగా, కోబ్రా బెటాలియన్ జవాన్లు ఆ ట్రైనింగ్ క్యాంప్ ను స్వాధీనం చేసుకుని డిటొనేటర్లతో ధ్వంసం చేశారు.

# కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు హౌస్ అరెస్ట్

- హౌసింగ్ బోర్డు స్థలాలను వేలం వేస్తున్న ప్రభుత్వం
- తమను వేలంలో పాల్గొనకుండా అడ్డుకుంటున్నారన్న ఎమ్మెల్యే
- ప్రజలకు ఉపయోగపడే స్థలాలను వేలం వేయడమేమిటని ప్రశ్న



**హైదరాబాద్ పెన్ పవర్:**కూకట్ పల్లి బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావును పోలీసులు గృహ నిర్బంధం చేశారు. ఈ తెల్లవారుజామున ఆయన నివాసానికి పెద్ద సంఖ్యలో చేరుకున్న పోలీసులు ఆయనను హౌస్ అరెస్ట్ చేశారు. మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావును కూడా గృహ నిర్బంధం చేశారు. కేపీహెచ్ బీ డివిజన్ లో హౌసింగ్ బోర్డు స్థలాలను వేలం వేస్తున్న నేపథ్యంలోనే వారిని హౌస్ అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ ప్రభుత్వ భూములను అమ్ముకునేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం యత్నిస్తోందని విమర్శించారు. తాము వేలంలో పాల్గొనకుండా అడ్డుకుంటున్నారని మండిపడ్డారు. వేలంలో పాల్గొనేందుకు ఇప్పటికే డీడీలు కూడా తీసుకున్నామని చెప్పారు. వేలంలో పాల్గొనకుండా అడ్డుకోవడంపై కోర్టును ఆశ్రయిస్తామని తెలిపారు. ప్రజలకు ఉపయోగపడే స్థలాలను ప్రభుత్వం తరపున వేలం వేయడమేమిటని ప్రశ్నించారు.

# తెలంగాణకు రాబోతున్న భారీ పెట్టబడులు

**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణ రాష్ట్రం ప్రపంచంతో పోటీపడాలని కొత్త విద్యుత్ పాలసీ తీసుకొచ్చామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారుతెలంగాణ రాష్ట్రంలో తద్వారా రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు రాబోతున్నట్టు పేర్కొన్నారు. ఖైరతాబాద్లోని విశ్వేశ్వరయ్య భవన్లో జరిగిన తెలంగాణ స్టేట్ పవర్ ఇంజనీర్స్ అసోసియేషన్ డైరీ ఆవిష్కరణ కార్యక్రమానికి భట్టి విక్రమార్క ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. ఇందిరమ్మ రాజ్యంలో రాష్ట్రంలో నాణ్యమైన విద్యుత్ అందిస్తున్నామన్నారు. వేసవిలో విద్యుత్ ప్రణాళికపై ఎస్పీడీసీఎల్ సిబ్బందితో సమీక్ష నిర్వహించామని, పూర్తి సన్నద్ధతతో ఉన్నామని అధికారులు హామీ ఇచ్చారన్నారు. రైతులు, పారిశ్రామిక వేత్తలు విద్యుత్ విషయంలో ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. యాదాద్రిని గత ప్రభుత్వం వదిలేయడం వల్ల భారం పెరిగిపోయిందని, పర్యావరణ అనుమతులు వేగంగా తీసుకొచ్చి యాదాద్రి యూనిట్-2 ప్రారంభించుకున్నామన్నారు. వేసవిలో విద్యుత్ ఉద్యోగుల బదిలీల ప్రక్రియ ఉంటుందని భట్టి విక్రమార్క హామీ ఇచ్చారు.

## యూజీసీ కొత్త నిబంధనలను వ్యతిరేకిస్తాం

### మాజీ ఎంపీ బి వినోద్ కుమార్

**హైదరాబాద్ పెన్ పవర్:**యూజీసీ కొత్త నిబంధనల పై అనేక రాష్ట్రాలు నిరసన తెలుపుతున్నాయి. తమిళ నాడు అసెంబ్లీ యూజీసీ నిబంధనలకు వ్యతిరేకంగా తీర్మానం చేసి పంపింది. ఫెడరల్ స్ఫూర్తిని మంట గలుపుతున్నారని తమిళనాడు సీఎం స్టాలిన్ కేంద్రప్రభుత్వం పై మండిపడ్డారని మాజీ ఎంపి బి వినోద్ కుమార్ అన్నారు. శుక్రవారం అయన మీడియాతో మాట్లాడారు. కేరళ సీఎం కూడా యూజీసీ ప్రతిపాదనలను వ్యతిరేకించారు. న్డీఏ భాగస్వామ్య పక్షమైనప్పటికీ జేడీయూ కి చెందిన బీహార్ సీఎం నితీష్ కుమార్ కూడా యూజీసీ ప్రతిపాదనలు వ్యతిరేకించారు. చంద్రబాబు ఇంకా స్పందించలేదు రేవంత్ రెడ్డి కాంగ్రెస్ సీఎం అయినప్పటికీ యూజీసీ ముసాయిదా పై స్పందించడం లేదని అన్నారు.తెలంగాణ అసెంబ్లీ లో యూజీసీ ముసాయిదా కు వ్యతిరేకంగా తీర్మానం చేయాలని డిమాండ్ చేస్తున్నాం. బీ ఆర్ ఎస్ అభిప్రాయాలను యూజీసీ చైర్మన్ జగదీశ్ కుమార్ కు ఈ రోజే పంపాము. యూజీసీ ముసాయిదా రాష్ట్రాల హక్కులను హరించే విధంగా ఉన్నాయి. తక్షణమే కొత్త ప్రతిపాదనలు విరమించుకోవాలని డిమాండ్ చేస్తున్నాం. వీసీ లను నియమించే అధికారం గవర్నర్ కు కట్ట బెట్టడం అప్రజాస్వామికం. డబ్బులు రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు పెట్టాలి ..వీసీ లను మాత్రం కేంద్రం నియమిస్తుందా ?. ఇది ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధమని అన్నారు.

ప్రొఫెసర్ల నియామకానికి ఉన్న నిబంధనలు మార్చే ప్రయత్నాన్ని కూడా తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాం. తమ కిష్టమైన వారిని బోధనానుభవం లేకున్నా కేంద్రం నియమించే అధికారం కొత్త నిబంధనలతో కలుగుతుంది ..దీన్ని కూడా వ్యతిరేకిస్తున్నాం.

త్వరలో కేంద్ర విద్యా శాఖ మంత్రి దేవేంద్ర ప్రధాన్ ను త్వరలో కలిసి యూజీసీ ముసాయిదా పై బీ ఆర్ ఎస్ అభ్యంతరాలను తెలియజేస్తాం. .తెలంగాణ లో జాతీయ రహదారుల కు సంబంధించి నితిన్ గడ్కరీ ని కలిసి వినతి పత్రం ఇస్తామని అన్నారు.

## గ్రామ సభల్లో మర్లబడుతున్న తెలంగాణ ప్రభుత్వ ఫెయిల్యూర్ కు ఇదే నిదర్శనం

### మాజీ మంత్రి హరీష్ రావు తీవ్ర ఆగ్రహం

**హైదరాబాద్ పెన్ పవర్:**జగిత్యాల జిల్లా, మల్లాపూర్ మండలం, మొగిలిపేట గ్రామసభలో మాజీ సర్పంచ్ నాగరాజు పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నం బాధాకరమని మాజీ మంత్రి హరీష్ రావు అన్నారు.ఇందిరమ్మ ఇండ్ల జాబితాలో తన పేరు లేదని ములుగు జిల్లా, బుట్టాయిగూడెంలో కుమ్మరి నాగయ్య అనే దళిత రైతు పురుగుల మందు తాగి ఆత్మహత్య యత్నానికి పాల్పడటం మనస్సు కలిచివేసింది. గ్రామ సభల్లో జరుగుతున్న ఇలాంటి వరుస ఘటనలు కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాన్ని ఎత్తి చూపుతున్నాయి.తన చావుతోనైనా అర్హులైన పేదలకు పథకాలు ఇవ్వాలని అధికారులకు చెబుతూ పురుగుల మందు తాగి, ఆసుపత్రి పాలైన ఆ రైతన్న దుస్థితికి ప్రభుత్వమే కారణమని అన్నారు.పంచాయతీ ఎన్నికల్లో లబ్ధి పొందాలనే యావతో, ఎలాంటి ముందస్తు ప్రణాళిక లేకుండా, లబ్ధిదారుల ఎంపిక సరిగ్గా జరపకుండా, జాబితాను విడుదల చేయడంతో ప్రజల్లో గందరగోళం నెలకొంది. దీంతో పాటు, కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు, నాయకులు కాంగ్రెస్ కార్యకర్తలకే పథకాలు అంటూ బాహాటంగా ప్రకటించడంతో గ్రామ సభల్లో లబ్దిదారుల ఎంపిక ప్రక్రియ పట్ల ప్రజల్లో ఆందళన మొదలైంది. ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలు ఈనెల 26వ తేదీన ప్రారంభిస్తున్నట్లు ప్రచారం చేసుకుంటూ, మరోవైపు గ్రామ సభల్లో విడుదల చేసిన జాబితా ఫైనల్ కాదని సాక్షాత్తూ ఉప ముఖ్యమంత్రి, రెవెన్యూ మంత్రి చెప్పడం హాస్యాస్పదం. అలాంటప్పుడు నాలుగు రోజుల పరిమితి పెట్టి గ్రామ సభలు నిర్వహించడంలో ఆంతర్యం ఏమిటి?గ్రామ సభల్లో విడుదల చేస్తున్న అర్హుల జాబితాకు ఉన్న విలువ ఏంది? 400 రోజుల పాటు అన్ని వర్గాల ప్రజలను విజయవంతంగా మోసం చేసిన కాంగ్రెస్ పార్టీ, చారిత్రక గణతంత్ర్య దినోత్సవం అయిన జనవరి 26న మరో మోసానికి సిద్ధమైందని విమర్శించారు. .

# సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి



**హైదరాబాద్ పెన్ పవర్:**సైబర్ నేరాల బారిన పడకుండా ప్రజలను నిత్యం అప్రమత్తం చేస్తూ ఉండాలని ఎస్పీ రోహిత్ రాజు పేర్కొన్నారు. శు క్రవారం ఎస్పీ రోహిత్ రాజు చుంచుపల్లి పోలీస్ స్టేషన్ ఆకస్మిక సందర్శించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. అనంతరం అక్కడ ఉన్న పోలీస్ అధికారులు సిబ్బందికి పలు సూచనలు చేశారు. పోలీస్ స్టేషన్ పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని వివిధ సమస్యలతో పోలీస్ స్టేషన్కు వచ్చే బాధితులకు న్యాయం చేకూర్చే విధంగా బాధ్యతగా మెలగాలని సూచించారు. పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన పలు కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్లో ఉన్న కేసుల సత్వర పరిష్కారానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలిపారు. పోలీస్ స్టేషన్లో పనిచేసే అధికారులు సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకున్నారు. చుంచుపల్లి పోలీస్ స్టేషన్ పైన ఉన్న డిస్ట్రిక్ట్ సైబర్ క్రైమ్స్ కో-ఆర్డినేషన్ సెంటర్ ను సందర్శించారు. ఇప్పటివరకు జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్లలో నమోదైన సైబర్ నేరాల వివరాలను అట్టి కేసుల పురోగతిని గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రజలు సైబర్ నేరాల బారిన పడకుండా జిల్లాలోని పోలీసు అధికారులతో ఎప్పటికప్పుడు సమన్వయం పాటిస్తూ అవగాహనా కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని సైబర్ క్రైమ్ కో-ఆర్డినేషన్ సెంటర్ అధికారులకు సూచించారు. కంటికి కనపడకుండా ఆన్లైన్ ద్వారా సైబర్ నేరగాళ్లు చేస్తున్న మోసాలను ఎప్పటికప్పుడు ప్రజలకు వివరించేలా కార్యక్రమాలను చేపట్టాలని తెలిపారు. సైబర్ నేరాల బారిన పడకుండా జిల్లా ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలని ఎస్పీ సూచించారు. ఈ కార్యక్రమంలో చుంచుపల్లి సీఐ వెంకటేశ్వర్లు, సైబర్ క్రైమ్స్ ఇన్స్పెక్టర్ జితేందర్, ఎస్సైలు రవి, జుబేదా బేగం సిబ్బంది పాల్గొన్నారు.

# విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలి





**హైదరాబాద్ పెన్ పవర్:**వసతి గృహాల్లో పరిశుభ్రతకు ప్రాధాన్యమిచ్చి మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని రాష్ట్ర పౌరసరఫరాల కార్యదర్శి, మత్స్యశాఖ డైరెక్టర్ డాక్టర్ ప్రియాంక అల అన్నారు. శు క్రవారం రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు సీనియర్ ఐఏఎస్ అధికారుల సోషల్, మైనారిటీ, బీసీ గిరిజన సంక్షేమ హాస్టల్లో రాత్రి తనిఖీ కార్యక్రమంలో భాగంగా కొత్తగూడెం జిల్లాలో పాల్వంచలో బొల్లోరి గూడెంలో ఉన్నటువంటి టీజీ ఎంఆర్ఎఫ్ వసతి గృహం తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ బాలికల కళాశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె వసతి గృహాల గదులను పరిశీలించారు. అనంతరం స్టోర్ రూమ్ లో నిల్వ ఉంచిన బియ్యం ఆహార పరిశీలించారు. కిచెన్ షెడ్ లో విద్యార్థులకు అందిస్తున్న భోజనం తయారిని పరిశీలించి వంటకు పరిశు భ్రమైన నీటిని వినియోగించాలని మెనూ ప్రకారం భోజనం అందించాలన్నారు. విద్యార్థులతో మమేకమై ఏమైనా సమస్యలు ఉన్నాయా అని తెలుసుకున్నారు. ఏమైనా సమస్య ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. అనంతరం ఆమె సిబ్బంది యొక్క హాజరు రిజిస్టర్లను పరిశీలించారు. అనంతరం డాక్టర్ ప్రియాంక అల మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలు రెసిడెన్షియల్ స్కూళ్ళు పాఠశాలల్లో విద్యార్థులకు అందించే భోజనం అల్పాహారం కలుషితం కాకుండా అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. భోజనం వండడానికి ముందే ప్రతీ రోజు క్రమం తప్పకుండా ఆహార పదార్థాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని నాసిరకం నాణ్యతా లేమితో కూడిన పదార్థాలను ఎట్టి పరిస్థితుల్లోనూ వినియోగించకూడదని ఆదేశించారు.

నాసిరకమైన బియ్యం ఇతర ఆహార పదార్థాలు కూరగాయలు సరఫరా చేసినట్లైతే తహాశీల్దాంకు సమాచారం అందించాలని వాటి స్థానంలో నాణ్యమైన సరుకులు కేటాయించేలా చర్యలు తీసుకుంటారని సూచించారు. విద్యార్థిని విద్యార్థులకు అందించే భోజనం విషయంలో నిర్లక్ష్యానికి తావిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఏ చిన్న ఫిర్యాదు వచ్చినా ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. ప్రతిరోజూ ఉపాధ్యాయులు వంతుల వారీగా ఆహార పదార్థాల నాణ్యతను తప్పనిసరి పరిశీలించాలని ఆదేశించారు. కాగా జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో వసతి గృహాల్లో నీటి వసతి మరుగుదొడ్లు వంటి కనీస మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ తనిఖీలలో మైనార్టీ సంక్షేమ అధికారి సంజీవరావు, పాల్వంచ ఎంఆర్ఓ వివేక్ మున్సిపల్ కమిషనర్ సుజాత తదితరులు పాల్గొన్నారు.

# దావోస్ టూర్ ను సీఎం రేవంత్ రెడ్డి బోగస్ గా మార్చారు



**హైదరాబాద్ పెన్ పవర్:** దావోస్ టూర్ ను సీఎం రేవంత్ రెడ్డి బోగస్ గా మార్చారు. గతం లో మాదిరిగానే సీఎం రేవంత్ రెడ్డి దావోస్ పర్యటన అబద్దాలతో గడిచింది. దావోస్ పెట్టుబడుల పై రేవంత్ రెడ్డి ప్రతిపక్షం లో ఉన్నపుడు ఓ మాట అధికారం లో ఉన్నపుడు ఓ మాట మాట్లాడుతున్నారని బీఆర్ఎస్ నేత మన్నే క్రిశాంక్ అన్నారు..పెట్టుబడుల ద్వారా కంపెనీ లకే లాభం తప్ప ప్రజలకు ఒరిగేదేమి లేదు అని రేవంత్ రెడ్డి గతం లో ఉన్నారు . .పీసీసీ అధ్యక్షుడిగా ఉత్తమ్ కూడా దావోస్ పెట్టుబడులతో ఉపయోగం లేదన్నారు. ఇపుడు మాత్రం పెట్టుబడుల పై సీఎం రేవంత్ ఊదర గొడుతున్నారు. దావోస్ లో గత సంవత్సరం లో వచ్చిన పెట్టుబడులు 40 వేల కోట్ల రూపాయలు అని ప్రభుత్వం ప్రకటించింది. అందులో ఇప్పటివరకు వచ్చినవి ఏమీలేవు. భట్టి విక్రమార్క కూడా దావోస్ పెట్టుబడులు కేవలం ఎక్స్ప్రెషన్ ఆఫ్ ఇంటరెస్ట్ మాత్రమే అన్నారు. మేఘా కంపెనీ ని రేవంత్ ఈస్ట్ ఇండియా కంపెనీ తో పోల్చారు. ఈస్ట్ ఇండియా కంపెనీ యూరోప్ లో ఉంది. దావోస్ కూడా యూరోప్ లో ఉందని అన్నారు. మేఘా కంపెనీ యూరోప్ కు చెందినదనే దావోస్ లో ఒప్పందం కుదుర్చుకున్నారా ? సన్ సంస్థ ఎండీ దావోస్ లో లేకున్నా ఉన్నారని ఆయనతో ఒప్పందం కుదుర్చుకున్నామని సీఎంఓ తప్పుడు ప్రకటన ఇచ్చింది. .రాష్ట్రానికి సీఎం గా ఉన్న వ్యక్తి తప్పుడు సమాచారం ఇవ్వొచ్చా ? సన్ పెట్రో కెమికల్స్ ఎండీ దిలీప్ సంఘ్వీ స్థానం లో వేరే వ్యక్తి తో సీఎం రేవంత్ రెడ్డి ఫోటో దిగారు. .అమెజాన్ సంస్థ పెట్టుబడులు కూడా కేసీఆర్ హాయం లో వచ్చినవే ..ఇపుడు వచ్చాయని రేవంత్ రెడ్డి గొప్పలు చెప్పుకుంటున్నారని అన్నారు.పాకిస్థాన్ కు చెందిన సంస్థ మెయిన్ హార్ట్ ఎండీ తో రేవంత్ మరోసారి సమావేశమయ్యారు. మూసి అభివృద్ధి పేరిట పాకిస్థాన్ సంస్థకు కాంట్రాక్టు కట్టబెట్టే ప్రయత్నం జరుగుతోంది. డెస్టినేషన్ వెడ్డింగ్ లు చూశాము .ఇపుడు రేవంత్ రెడ్డి దావోస్ లో మన రాష్ట్రం కంపెనీ లతో దావోస్ లో ఒప్పందాలు కుదుర్చుకుని డెస్టినేషన్ ఇన్వెస్ట్మెంట్స్ గా మార్చారు. గతం లో కుదిరిన ఒప్పందాలు ఎంత వరకు వాస్తవ రూపం దాల్చాయో శ్వేత పత్రం ప్రకటించాలి. బోగస్ కంపెనీ లతొ ఒప్పందాలు కుదుర్చుకుని రేవంత్ ప్రచార ఆర్భాటాలు చేస్తున్నారు. ఒప్పందాలు కుదుర్చుకున్న కొన్ని కంపెనీల పేర్లు అసలు మనుగడలోనే లేవు. దావోస్ అంటే బోగస్ గా మార్చిన ఘనత రేవంత్ రెడ్డి దే. సీఎం దావోస్ టూర్ కామెడీ సర్కస్ గా మారింది. అంకెల గారడీ తప్ప పెట్టుబడుల లెక్కల్లో వాస్తవం లేదని అయన అన్నారు.

# అర్హులైన ప్రతీ లబ్ధిదారులకు పథకాలు అందుతాయి..

- **లిస్టులో పేర్లు రాని వారు ఎవ్వరూ అధైర్య పడాల్సిన అవసరం లేదని, అర్హులైన ప్రతి ఒక్కరికీ రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతాయి.**
- **వాస్తవలకు దగ్గరగా ప్రజాపాలన ఉండాలనే లక్ష్యం తోనే గ్రామసభలు నిర్వహించి అర్హులను గుర్తిస్తున్నాం..**
- **ఈ నాలుగు సంక్షేమ పథకాల గురించి లిస్ట్ లో పేర్లు రాని వారు మళ్ళీ దరఖాస్తు చేసుకోవచ్చు.**
- **భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, నకిరేకల్ శాసన సభ్యులు వేముల వీరేశం.....**

**హైదరాబాద్ పెన్ పవర్:**ప్రజా పాలనలో భాగంగా ఈ రోజు నల్గొండ జిల్లా, చిట్యాల మండలం వెలిమినేడు గ్రామం, యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం వెల్లకి గ్రామం మరియు రామన్నపేట పట్టణంలో రైతు భరోసా,ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్లు మరియు రేషన్ కార్డులకు జాబితా ఆమోదించుట కొరకు నిర్వహించిన గ్రామ సభ కార్యక్రమాలలో నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం తో కలిసి ముఖ్య అతిధిగా హాజరైన భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్

ఈ గ్రామ సభలలో వారు మాట్లాడుతూ.... రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్లు, కొత్త రేషన్ కార్డులు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, పథకాల అమలు కోసం గ్రామ సభలు నిర్వహించి అభ్యంతరాలు, దరఖాస్తులను స్వీకరిస్తున్నామన్నారు.ప్రతి పేద కుటుంబానికి సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ ధ్యేయమని ఆ నిరుపేదలను గుర్తించడం ప్రతి మండలంలోని అధికారుల బాధ్యత అని అన్నారు.

రాష్ట్రంలో అర్హులైన ప్రతి నిరుపేద కుటుంబాలకు సంక్షేమ పథకాలు అందుతాయని ఎవరు హైరానా పడకుండా ఉండాలని కోరారు.లబ్ధిదారుల ఎంపిక విషయంలో ఎలాంటి అవకతవకలు జరగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు.అసలైన లబ్ధిదారులను గుర్తించడం కోసమే ప్రతి గ్రామంలో గ్రామ సభలు ఏర్పాటు చేసి ప్రభుత్వాన్ని ప్రజల ముందుకు తీసుకురావడమే సీఎం రేవంత్ రెడ్డి లక్ష్యం అని అన్నారు.

# తెలంగాణకు రాబోతున్న భారీ పెట్టబడులు

**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణ రాష్ట్రం ప్రపంచంతో పోటీపడాలని కొత్త విద్యుత్ పాలసీ తీసుకొచ్చామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారుతెలంగాణ రాష్ట్రంలో తద్వారా రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు రాబోతున్నట్టు పేర్కొన్నారు. ఖైరతాబాద్లోని విశ్వేశ్వరయ్య భవన్లో జరిగిన తెలంగాణ స్టేట్ పవర్ ఇంజనీర్స్ అసోసియేషన్ డైరీ ఆవిష్కరణ కార్యక్రమానికి భట్టి విక్రమార్క ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. ఇందిరమ్మ రాజ్యంలో రాష్ట్రంలో నాణ్యమైన విద్యుత్ అందిస్తున్నామన్నారు. వేసవిలో విద్యుత్ ప్రణాళికపై ఎస్పీడీసీఎల్ సిబ్బందితో సమీక్ష నిర్వహించామని, పూర్తి సన్నద్ధతతో ఉన్నామని అధికారులు హామీ ఇచ్చారన్నారు. రైతులు, పారిశ్రామిక వేత్తలు విద్యుత్ విషయంలో ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. యాదాద్రిని గత ప్రభుత్వం వదిలేయడం వల్ల భారం పెరిగిపోయిందని, పర్యావరణ అనుమతులు వేగంగా తీసుకొచ్చి యాదాద్రి యూనిట్-2 ప్రారంభించుకున్నామన్నారు. వేసవిలో విద్యుత్ ఉద్యోగుల బదిలీల ప్రక్రియ ఉంటుందని భట్టి విక్రమార్క హామీ ఇచ్చారు.

# డబ్ల్యుఎఫ్ వేదికపై ఆంధ్రప్రదేశ్ అంతరంగాన్ని ఆవిష్కరించిన యువగళం

- **30మందికి పైగా గ్లోబల్ పారిశ్రామికవేత్తలతో ముఖాముఖి భేటీలు**
- **8 రౌండ్ టేబుల్ సమావేశాలు, 9మంది అంతర్జాతీయ నిపుణులతో చర్చలు**
- **బ్రాండ్ ఏపి పునరుద్దరణ లక్ష్యంగా సాగిన లోకేష్ దావోస్ పర్యటన**
- **విజయవంతంగా పర్యటన ముగించుకొని రాష్ట్రానికి బయలుదేరిన యువనేత**

**హైదరాబాద్ పెన్ పవర్:** అయిదేళ్ల అరాచకపాలనలో దెబ్బతిన్న బ్రాండ్ ఎపి పునరుద్దరణే లక్ష్యంగా వరల్డ్ ఎకనమిక్ ఫోరం వేదికపై యువనేత, రాష్ట్ర ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ తమ గళాన్ని విన్పించడంలో సఫలీకృతులయ్యారు. దావోస్ లో విజయవంతంగా తన పర్యటన పూర్తిచేసుకుని నేడు సొంతగడ్డకు బయలుదేరారు. దావోస్ వేదికగా నాలుగురోజులపాటు జరిగిన ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సులో 30మందికి పైగా గ్లోబల్ పారిశ్రామికవేత్తలతో మంత్రి లోకేష్ ముఖాముఖి భేటీ అయ్యారు. తొలిరోజున స్విట్జర్లాంట్ పారిశ్రామిక వేత్తలు, తెలుగు డయాస్పోరా సమావేశాలకు హాజరై రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధికి సహకరించాలని విజ్ఞప్తిచేశారు. ఒకవైపు గ్లోబల్ పారిశ్రామికవేత్తలతో ముఖాముఖి సమవేశాలు నిర్వహిస్తూనే మరోవైపు 8 రౌండ్ టేబుల్ సమావేశాలకు హాజరై ఆయారంగాల్లో ఆంధ్రప్రభుత్వ విధానాలపై తమ గళాన్ని విన్పించారు. 9 మంది వివిధరంగాల అంతర్జాతీయ నిపుణులతో సమావేశమై ఎపిలో పెట్టుబడులకు గల అవకాశాలపై చర్చించారు. రాష్ట్రంలో ప్రజాప్రభుత్వం ఏర్పాటయ్యాక ప్రకటించిన ఇన్వెస్టర్స్ ఫ్రెండీ విధానాలు, అమలు చేస్తున్న ప్రోత్సహాకాలు, పరిశ్రమలకు అనువైన పర్యావరణ వ్యవస్థ, ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, క్లీన్ ఎనర్జీ వంటి రంగాల్లో ఎపి ప్రభుత్వ ప్రాధాన్యతలు, అందిస్తున్న ప్రోత్సాహకాలు పారిశ్రామికవేత్తలకు వివరించి రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాల్సిందిగా విజ్ఞప్తి చేశారు.. దార్శనిక ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలో ఎపి ఏవిధంగా అభివృద్ధి పథంలో పయనిస్తుందో ప్రత్యక్షంగా వివరించారు.

## హైదరాబాద్‌లో కిడ్నీ రాకెట్

# 8 మందిదళారులను గుర్తించిన పోలీసులు

**హైదరాబాద్ పెన్ పవర్:** సరూర్‌నగర్ పరిధిలోని అలకనంద ఆస్పత్రి కిడ్నీ రాకెట్ కేసులో పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. ఈ వ్యవహారంతో సంబంధం ఉన్న ఎనిమిది మంది దళారులను పోలీసులు గుర్తించారు.

గత ఆరు నెలలుగా అలకనంద ఆస్పత్రిలో ఈ తతంగం నడుస్తున్నట్లు గుర్తించారు. బెంగళూరుకు చెందిన వైద్యుడు కీలకంగా వ్యవహరించినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. వైద్యుడితో పాటు మరికొంత మంది ప్రమేయం ఉందేమోనన్న కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఈ కేసుకు సంబంధించి ఇప్పటికే ఆస్పత్రి నిర్వాహకుడు సుమంత్‌తోపాటు మరికొందరిని అదుపులోకి తీసుకొని ప్రశ్నిస్తున్నారు.

# ఆధ్యాత్మికం: రిలేషన్ షిప్ అంటే ఏమిటి... స్వేచ్ఛకు.. ప్రేమకు తేడా ఇదే

**హైదరాబాద్ పెన్ పవర్:రిలేషన్ షిప్ అంటే ఏమిటి.. స్వేచ్ఛకు.. ప్రేమకు తేడా ఏంటి.. పూర్వకాలంలో స్వేచ్ఛను ఎలా అనుభవించేవారు.. ప్రేమను ఎలా స్వీకరించేవారు.. వీటి గురించి సద్గురు ఏం చెప్పారు.. మొదలగు విషయాలను ఈ స్టోరీలో తెలుసుకుందాం, , ,**



పూర్వకాలం నుంచి నేటి వరకు దీనిని అర్థం చేసుకోవడం అనేది స్వేచ్ఛకు సంబంధించింది. మానవ చరిత్రలో అంటే గతంలోనూ, ఇప్పుడు లేదా భవిష్యత్తులో మానవ సంబంధాలు అనేవి స్వేచ్ఛకు సంబంధించినవే. ప్రతి మనిషి కొంచెం రొమాంటిక్ గా ఉంటారు. అలా ఉండటాన్నే అన్ కండిషనల్ అని... అదే నిజమైన, స్థిరమైన ప్రేమ అని అనుకుంటారు.
కానీ, రిలేషన్ షిప్స్ అంటేనే రోజూ మారుతూ ఉంటాయి. వాటిని, రోజువారీ బాధ్యతలు నిర్వహించినట్టుగానే.. మేనేజ్ చేయాలి. ఒక్కరోజు సరిగ్గా మేనేజ్ చేయలేకపోయినా.. అది ఎక్కడికో వెళుతుంది. వేల ఏళ్లుగా మానవ సంబంధాలు ఇలాగే నడుస్తున్నాయి. రిలేషన్ షిప్ అనే గేమ్ లో నాలుగు రాళ్లు పైకి విసిరి.. కిందపడకుండా ఆడటం లాంటిదే.. ఒకేసారి నాలుగు రాళ్లను పైకి ఎగరేసి ఆటాడితే.. ఏదో ఒకటి కింద పడిపోతుంది. కిందపడకుండా మేనేజ్ చేయాలంటే.. ఏకాగ్రత... స్కిల్స్ అవసరం. శ్రద్ధగా ఉండకపోతే.. ఏం జరుగుతుందో కూడా మీకు తెలియదు. మానవ సంబంధాలు ఎప్పుడూ మారుతూ ఉంటాయి. అవి స్థిరంగా ఉండవు. స్థిరంగా ఉండాలంటే.. దానికి చాలా ఏకాగ్రత ఉండాలి. ఇలాంటి ఏకాగ్రత లేకపోవడం వల్లే కొంతమందికి రిలేషన్ షిప్స్ మేనేజ్ చేయడానికి సమయం.. శక్తి రెండూ ఉండవు. అప్పుడు వాళ్లు వాళ్లు వేరే దారిలో వెళ్తుంటారు. ఆ దారిలో ఇలా నియమ నిబంధనలేం ఉండవు. వాళ్లు కళ్లు మూసుకుంటారు. ధ్యానంలో మునిగిపోతారు. వాళ్ల చుట్టూ ఏముంది? వాళ్ల చుట్టూ ఎవరున్నారు? అనే విషయాలేం పట్టించుకోరు. అది మీరు చేయలేదు. అందుకే తమను తాము శిక్షించుకుంటారు.

**ఒక్కసారి ఆలోచిస్తే...**

అసలు మీ జీవితంలో దేన్ని కావాలనుకుంటున్నారు? ఎదుటివాళ్లు అన్న ప్రతి మాటకు ఇంకోమాట అంటే సమస్య తీరిపోతుందా? ఒక్కసారి కూర్చొని ఆలోచించండి. మీ భ్రమలన్నీ పటాపంచలవుతాయి. భ్రమలు ఆవిరైనప్పుడే.. జీవితాన్ని మరింత దగ్గర నుంచి చూడటం.. మొదలు పెడతారు. అప్పుడే రియాలిటీ ఏంటో తెలిసివస్తుంది.
నా జీవితం ఏంటీ? దాని స్వభావం ఎలాంటిది? ఎందుకు ఇలా జరుగుతోంది?' అని ఆలోచించడానికి ఇదే మంచి అవకాశం జీవితం అంటే సంపూర్ణమైనది కదా? మరి ఎందుకు ఈ జీవితం అసంపూర్ణంగా అనిపిస్తుంది? ఈ లోటుని తీర్చడానికి మరో వ్యక్తి కావాలని ఎందుకనిపిస్తుంది? ఒక్కసారి ఆలోచించండి. వాస్తవానికి ఈ జీవితం సంపూర్ణమైనది. కానీ, వాళ్లు ..వీళ్లు తమ జీవితంలో ఉంటేనే సంపూర్ణం అవుతుందని ఎందుకనుకుంటున్నారు? వాళ్లెవరో లేకుంటే జీవితమే లేనట్లు ఎందుకు ప్రవర్తిస్తున్నారు? ఈ ఆలోచనే జీవితాన్ని అసంపూర్ణంగా మారుస్తుంది. క్రియేటర్, క్రియేషన్ కలిసి ఉంటాయి. ఇదే అన్నింటికంటే గొప్పంబంధం.

**ఇదే మంచి అవకాశం**

జీవిత భాగస్వామి మిమ్మల్ని మోసం చేయగలరు. వాళ్ళు ఇల్లు విడిచి వెళ్లగలరు. వాళ్లు విడాకులూ ఇవ్వగలరు. లేదంటే వాళ్లు చనిపోవచ్చు. ఒకవేళ వాళ్లు చనిపోతే... మోసం చేశారని అంటారా? అలాంటి ఆలోచన వస్తుంది. వాళ్లు ఏ విధంగా మిమ్మల్ని వద్దనుకున్నది సమస్య కాదు. మోసం చేసినా, విడాకులు ఇచ్చినా, విడిచిపోయినా, చనిపోయినా .. ఏమైనా కావొచ్చు. ఈ సగం జీవితం.. ఇంకో వ్యక్తితో పరిపూర్ణమవుతుంది. అనే ఒక భ్రమ పటాపంచలవుతుంది. ఇది అర్థం చేసుకుంటే పరిపూర్ణమైన జీవితం అంటే ఏంటో తెలుస్తుంది. ఆ రోజు నుంచి రిలేషన్ పిప్స్ చూసే తీరు పూర్తిగా మారిపోతుంది. అప్పుడు మీరు ఏ వ్యక్తికైనా మరింత దగ్గరవుతారు వాళ్లతో అన్ని షేర్ చేసుకుంటారు. అదే మార్పు కాబట్టి.. దీన్ని మారడానికి వచ్చిన అవకాశంగా భావించాలి. ఒక భ్రమ నుంచి రియాలిటీ వైపు మళ్లించినందుకు ఆ వ్యక్తికి థ్యాంక్స్ చెప్పుకోండి. జీవితాంతం ఒక భ్రమలో బతకకుండా. వాళ్లు చాలా తక్కువ టైమ్ లోనే మీరు రియలైజ్ అయ్యేలా చేశారు. లేదంటే ఈ విషయం మీరు చనిపోయే ముందు తెలిస్తే. నాకు భయమేస్తోంది! నువ్వు నాతో రాకూడదా? అంటే పార్ట్ నర్ కచ్చితంగా నో అంటారు. చేదు నిజం చివరి ఘడియలో తెలియడం కంటే ఇప్పుడు తెలుసుకోవడమే బెటర్!

# రిపబ్లిక్ డే ఇలా కూడా: స్కూల్ డేస్ గుర్తు చేసుకుందామా

**హైదరాబాద్ పెన్ పవర్:**రిపబ్లిక్ డే అంటే మన రాజ్యాంగం అమలులోకి వచ్చిన ఈ రోజు దేశానికే చాలా ప్రత్యేకం. అందుకే స్పెషల్‌గా సెలబ్రేట్ చేసుకుంటాం. జనవరి 26 వచ్చిందంటే చిన్నప్పుడు స్కూల్లో జరిగే జెండా వందనం హడావిడితో పాటు చాక్లెట్లు, ఆటపాటలు గుర్తొస్తాయి. పెద్దయ్యే కొద్దీ ఆ సెలబ్రేషన్నిని మర్చిపోతూ ఉంటారు. కానీ ఆ రోజులను మరోసారి గుర్తుచేసుకుంటూ ఇప్పటి పరిస్థితులకు తగ్గట్టు జరుపుకోవచ్చు.



**పెరేడ్ చూడాలి**

రిపబ్లిక్ రోజు స్పెషల్ గా చూడాల్సిన వాటిల్లో పెరేడ్ ఒకటి. దేశంలో ఎక్కడెక్కడినుంచో చాలామంది పెరేడ్‌ను చూడానికి డిల్లీ వస్తారు. క్రమశిక్షణతో చేసే విన్యాసాలు, ఎయిర్ ఫోర్స్ విన్యాసాలు చూస్తే ఎవరిదైనా గొప్ప ఫీలింగ్ కలగక మానదు.. అందుకే ఈ రోజు ఎప్పుడు చూసే టీవీ ప్రోగ్రామ్స్ కి బ్రేక్ ఇచ్చి దేశభక్తిని పెంచే పెరేడ్ విన్యాసాలు చూడొచ్చు.

**లోకల్ రిపబ్లిక్ టూర్**

రిపబ్లిక్ డే సందర్భంగా ఒకసారి లోకల్ టూర్ వేసిరావొచ్చు, బెంగళూరు, హైదరాబాద్, వైజాగ్, ఢిల్లీ, ముంబై లాంటి నగరాల్లో రిపబ్లిక్ డే సందర్భంగా రోడ్లు, పబ్లిక్ ప్లేసులన్నీ మూడురంగులతో మెరిసిపోతూ ఉంటాయి.. చారిత్రక కట్టడాలను కూడా జెండా రంగుల్లో ముస్తాబు చేస్తారు. వీలుంటే అలాంటి సెలబ్రేషన్స్ అన్నీ చూసిరావచ్చు. వాటితో పాటు రిపబ్లిక్ డే వచ్చిందంటే ఆన్లైన్లో. బయట షాపింగ్ మాల్స్‌లో డిస్కౌంట్ సెల్స్ నడుస్తూ ఉంటాయి. వీలుంటే వాటికి కూడా వెళ్లిరావొచ్చు.

**గౌవరంగా**

రిపబ్లిక్ డే రోజు దేశానికి గౌవరంగా కొన్ని చిన్న రూల్స్ కూడా పాటించొచ్చు. నాన్వెజ్‌కు నో చెప్పడం, ఆల్కహాల్ తీసుకోకపోవడం వల్ల రిపబ్లిక్ డేకు రెస్పెక్ట్ ఇచ్చినవాళ్లమవుతాం. అలాగే ఈ రోజు స్పెషల్‌గా కొన్ని వాలంటరీ యాక్టివిటీస్ కూడా ప్లాన్ చేయొచ్చు. స్కూల్‌కి లేదా ఆశ్రమాలకు వెళ్లి వాళ్లతో గడపడం వాలంటర్ పసులు చేయడం లాంటివి ట్రై చేయొచ్చు.

**డ్రెస్ డిఫరెంట్**

రిపబ్లిక్ డే ను డిఫరెంట్ గా సెలబ్రేట్ చేసుకోవాలంటే ఆ రోజు డ్రెస్సింగ్ డిఫరెంట్‌గా ఉండాలి. తెలుపు రంగు బట్టలు వేసుకుని షర్టుపైన జెండాను ధరిస్తే పేట్రియాటిక్ లుక్ వస్తుంది. అలాగే పిల్లలకు రకరకాల డిజైన్స్ లో ఉండే మూడురంగుల డ్రెస్లు వేయొచ్చు. ఇవే కాకుండా చెవి రింగులు, రిస్ట్ బ్యాండ్లు లాంటివి కూడా మూడురంగులవి ఎంచుకుంటే రిపబ్లిక్ డే స్పెషల్ గా, పేట్రియాటిక్ లుక్‌తో కనిపించొచ్చు.

**సినిమాతో..**

ఈ రిపబ్లిక్ డే ఎలాగూ సండే వచ్చింది కాబట్టి ఇంట్లో గడిపేవాళ్లే ఎక్కువ మంది. అందుకే ఒక మంచి దేశభక్తి సినిమాతో ఎంజాయ్ చేయొచ్చు. టీవీలో ప్రతి రిపబ్లిక్ డేకి ఏదో ఒక పేట్రియాటిక్ మూవీ టెలీకాస్ట్ అవుతుంది. అది నచ్చకపోతే ప్రైమ్,నెట్ ఫ్లిక్స్ లో కూడా బోలెడన్ని పేట్రియాటిక్ మూవీస్ ఉంటాయి. వాటినిచూస్తూ ఎంజాయ్ చేయచ్చు.

**ఎకో రిపబ్లిక్ డే**

రిపబ్లిక్ డే రోజు ఇళ్లు, క్లాసురూములు, ఆఫీసులు, రోడ్లన్నీ మూడురంగులతో మెరిసిపోతూ ఉంటాయి. ఎక్కడ చూసినా తళతళ మెరుస్తూ ప్లాస్టిక్ జెండాలే కనిపిస్తాయి. రిపబ్లిక్ డే అయిపోయిన తెల్లారే ఆ కాగితాలన్నీ ప్లాస్టిక్ చెత్తగా మారతాయి. అలాకాకుండా మనవంతు బాధ్యతగా పద్యావరణాన్ని కాపాడాలంటే రిపబ్లిక్ డేను ఎకో ఫ్రెండ్లీగా జరువుకోవచ్చు. ప్లాస్టిక్ జెండాలకు బదులు పేవర్ జెండాలు లేదా సీడ్ పేపర్ జెండాలు వాడొచ్చు. సీడ్ పేపర్ ఫ్లాగ్స్ ను బయట పడేయకుండా ఇంట్లో కుండలో వేస్తే వాటి నుంచి మెక్కలు కూడా పెరుగుతాయి.

**స్పెషల్ క్రాఫ్ట్స్**

పిల్లలు ఈరోజు కొత్తగా క్రాఫ్ట్స్ తో ఆటలాడించొచ్చు. రిపబ్లిక్ డే థీమ్ తో క్రాఫ్ట్స్ తయారు చేయించడం. క్రాఫ్ట్స్ గేమ్స్ ఆడించడం.. పెయింటింగ్స్ గీయించడం లాంటి యాక్టివిటీస్ ద్వారా పిల్లలకు రిపబ్లిక్ డే ప్రత్యేకతను తెలియజేసిన వాళ్లమవుతాం. అలాగే రోజంతా పిల్లలతో టైంపాస్ చేసినట్టూ ఉంటుంది.